అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 27 మార్చి 2026 పేజీలు : 04

బీటీపీ కాలువకు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందించండి

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

మంత్రితో మాట్లాడుతున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణ్‌దుర్గం, మార్చి 26 ప్రభాతవార్త

విజయవాడలోని నీటిపారుదల శాఖ మంత్రి కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడుని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం ప్రాంత జీవనాడి బీటీపీ కాలువ కోసం భూములు ఇచ్చిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించాలని కోరారు. అందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చి కాలువ పనులు మరింత వేగంగా జరిగేలా చూడాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలియజేశారు.

విదేశీ విద్య చేరువ చేసేందుకే ఇల్లూనాయిస్ యూనివర్సిటీతో ఒప్పందం

- జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు

జెఎన్‌టియుఏ ఇల్లీనాయిస్ మధ్య చేసుకున్న ఒప్పంద పత్రాలతో విసి సుదర్శన్‌రావు

అనంతపురం సిటీ, మార్చి 26 ప్రభాతవార్త

జిల్లాలోని విద్యార్థులకు విదేశీ విద్యను చేరువ చేసేందుకై అమెరికాకు చెందిన ప్రముఖ యూనివర్సిటీ ఇల్లూనాయిస్‌తో ఒప్పందం చేసుకున్నట్లు జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు పేర్కొన్నారు. జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు అమెరికాలోని ప్రసిద్ధ ఇల్లీనాయిస్ విశ్వవిద్యాలయం ఛాన్స్‌లర్ డా.జానెట్ గూచ్‌తో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. ఇల్లీనాయిస్ విశ్వవిద్యాలయం ఛాన్స్‌లర్ జానెట్ గూచ్, యుఐఎస్ అధ్యక్షుడి సలహాదారులు దేబాశిష్‌దత్తా, యుఐఎస్‌కి చెందిన డా.రంజన్ క్రేలు జెఎన్‌టియుఏను సందర్శించారన్నారు. ఈ సందర్భంగా జెఎన్‌టియుఏ ఇల్లీ నాయిస్ యూనివర్సిటీ మధ్య దీర్ఘకాలిక బహుముఖ విద్యాభ్యాసాన్ని నెలకొల్పేందుకై చర్చించడం జరిగిందన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచ వాతావరణంలో ఉన్నత విద్యా రంగంలో అంతర్జాతీయ సహకారాల ప్రాముఖ్యత పెరిగిందన్నారు. రెండు యూనివర్సిటీల మధ్య పరస్పర సహకారంతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. విద్యార్థుల ఉపాధి అవకాశాలు పెంపొందించడమే ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ప్రముఖ అమెరికన్ విశ్వవిద్యాలయం ఇల్లీనాయిస్‌తో జెఎన్‌టియుఏ ఒప్పందం చేసుకోవడం కీలక పరిణామం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్వాంటం టెక్నాలజీ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ సైతం ఇటీవల నిర్వహించిన యూనివర్సిటీ ఛాన్స్‌లర్‌ల సమావేశంలో ప్రతి యూనివర్సిటీ రెండు విదేశీ యూనివర్సిటీలతో అవగాహన కలిగి ఉండాలని సూచించారన్నారు. అందులో భాగంగానే ఇల్లీనాయిస్ వంటి ప్రముఖ యూనివర్సిటీతో దీర్ఘకాలిక విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా చర్చలు జరిపామన్నారు. పూర్తి స్థాయిలో వీటిపై త్వరలోనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇల్లీనాయిస్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ జానెట్‌గూచ్ మాట్లాడుతూ.. జెఎన్‌టియుఏతో కుదుర్చుకున్న ఎంఒయు కుదుర్చుకోవడానికి చర్యలు ప్రారంభించామని త్వరలోనే పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. జెఎన్‌టియుఏ విద్యా పరమైన బలాలు, మౌలిక సదుపాయాలు, పరిశోధన సామర్థ్యాలకు తోడుగా విద్యార్థులకు ప్రముఖ యూనివర్సిటీ ఇల్లీనాయిస్ భాగస్వామ్యం మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్లు, విదేశీ వ్యవహారాల డైరెక్టర్ సురేష్‌బాబు, డిఏపి ప్రొ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్ సి ఆర్ ఎ అనుమతిపై సీఎంకు కృతజ్ఞతలు

- రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు

సీఎం చంద్రబాబు సన్మానిస్తున్న అనంతపురం ఎమ్మెల్యేలు, మంత్రి నారా లోకేష్ సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు

అనంతపురం, మార్చి 26, (ప్రభాత వార్త బ్యూరో)

అనంతపురం జిల్లా ఆశాదీపం ఆర్డిటి సంస్థకు ఎఫ్ సి ఆర్ ఎ అనుమతికి విశేష కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, మంత్రి నారా లోకేష్ బాబుకు, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబులు కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతిలో గురువారం సాయంత్రం వారిద్దరిని వేర్వేరుగా కలుసుకుని జిల్లా ప్రజానీకం తరపున ఎమ్మెల్యేలు ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దృష్టికి సమస్య తీవ్రతను తీసుకెళ్లడం, అనంతరం మంత్రివర్యులు నారా లోకేష్ బాబు పదేపదే పర్యవేక్షణ చేయటం వల్లే అనుమతులు లభించాయని కొనియాడారు. మీరు చేసిన గట్టి ప్రయత్న ఫలితమే ఈ రోజు కరువు పీడిత ప్రాంతాలకు ఆర్డిటి సేవలు కొనసాగించటానికి అవకాశం లభించిందని పేర్కొన్నారు.

అనంతపురం జిల్లా లాంటి వెనుకబడిన ప్రాంతంలో ఐదు దశాబ్దాలుగా లక్షలాది మంది పేదల జీవితాల్లో ఈ సంస్థ వెలుగులు నింపుతోందని వివరించారు. ఇది కేవలం ఒక సంస్థ సమస్య కాదని, జిల్లాలోని లక్షలాది మంది నిరుపేదల జీవన విధానంలో ఓ భాగంగా తాము భావిస్తున్నామని వెల్లడించారు. నిబంధనల అడ్డంకి కారణంగా 2021 లోనే ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ ఆగిపోయినా ఆనాటి వైకాపా పాలకులు ఏమాత్రం ఈ విషయంపై దృష్టి పెట్టలేదని తెలియజేశారు. వారి నిర్లక్ష్యం కారణంగా సేవలు కొనసాగించలేని పరిస్థితి ఆర్డిటి సంస్థకు వచ్చిందని తెలిపారు. అనుమతుల జాప్యం వల్ల సంస్థ ద్వారా అందుతున్న ఉచిత వైద్యం, విద్య, క్రీడా, గ్రామీణ అభివృద్ధి రంగాలు పూర్తిగా ఆగిపోయే ప్రమాదం ఏర్పడిందని వివరించారు. ఈ పరిస్థితుల్లో 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకొన్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉన్న క్లిష్టమైన ఎఫ్.సి.ఆర్.ఎ నిబంధనలను అధిగమించి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించటానికి తమరు తీసుకొన్న ప్రత్యేక శ్రద్ధ, పట్టుదలను ప్రజలు ఏనాటికి మర్చిపోరన్నారు. అనంతపురం జిల్లా ప్రజల పట్ల, ముఖ్యంగా బలహీన వర్గాల పట్ల మీకున్న అపారమైన ప్రేమకు ఈ విజయం ఒక నిలువుటద్దమని వివరించారు. మీ నాయకత్వంలో జిల్లా మరింత పురోగతి సాధిస్తుందని తామంతా గట్టిగా విశ్వసిస్తున్నామని మరోసారి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వెనుకబడ్డ తరగతుల శాఖ మంత్రి సవితమ్మ పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి - ఆరోగ్యశాఖ సమీక్షలో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ మార్చి 26 ప్రభాతవార్త

జిల్లా పరిధిలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ప్రభుత్వ నిబంధనల మేరకు కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ హెచ్చరించారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పిసి మరియు పిఎన్డిటి ఆక్ట్ అమలుపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రా ప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం తో పాటు ఆరోగ్యశాఖ పనితీరుపై వేరువేరుగా జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఉన్న స్కానింగ్ సెంటర్ లు చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడితే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆరోగ్య,పోలీసు శాఖలు మరియు స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో స్కానింగ్ కేంద్రాలపై నిరంతర గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. తనిఖీ చేసిన స్కానింగ్ కేంద్రాలలో ఏవైనా లోపాలు ఉన్నట్లు గుర్తించినట్లయితే ఆయా కేంద్రాలపై నిబంధనలు ఉల్లంఘించినందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. వచ్చే త్రైమ్నాస లో తప్పక కేసులు నమోదు చేయాలని , నిబంధనలు ఉల్లంఘించి అబార్షన్ మందులు అమ్మిన అలాంటి మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు . జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయుచున్న స్కానింగ్ కేంద్రాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మరి ముఖ్యంగా వైద్య ఆరోగ్య మరియు శిశు సంక్షేమ శాఖ లు సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఆడపిల్లలు ఉన్న కుటుంబాల గృహాలను సందర్శించి బాలికా విద్య, బాల్య వివాహాల నిర్మూలన లింగ వివక్షతను రూపు మాపడం పై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో మరో 10 స్కానింగ్ సెంటర్లు నిర్వహించుకునేందుకు అనుమతి మంజూరు తో పాటు అదేవిధంగా గడువు తీరిన14 స్కానింగ్ సెంటర్ లకు రెన్యువల్ చేస్తూ తీర్మానం , 21 స్కానింగ్ సెంటర్ల మార్పులు చేర్పులకు అనుమతులు మంజూరు చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఈ .బి .దేవి, ఆర్ జి టి హెల్త్ డైరెక్టర్ డా. దుర్గేష్, పోలీస్ ఎస్ఐ విజయభాస్కర్, డెమో నాగరాజు, డిప్యూటీ డెమో లక్ష్మీనారాయణ, హెచ్ ఇ ఓ గంగాధర్, లీగల్ అడ్వైజర్ ఆషారాణి మరియు డెమో సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.... అనంతరం వివిధ విభాగాల వైద్య అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ ప్రస్తుత వేసవికాలంలో ఎండలు తీవ్రత పెరుగుతున్నందున వైద్య సిబ్బంది అన్ని స్థాయిలోనూ ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్ని ఆసుపత్రులలో ఓఆర్ఎస్ ను అందుబాటులో ఉంచాలని అలాగే ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ బి దేవి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ సెల్వారాజ్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, దాజయలక్ష్మి డా.శ్రీనివాసరెడ్డి డా.విష్ణుమూర్తి డి ఎం ఓ ఓబులు, ఎస్ ఓ మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఫెర్రర్ కుటుంబంతో పరిటాల కుటుంబం ఆత్మీయ కలయిక

- **సంతోషం.. ఉద్వేగభరితమైన పలుకరింపులు**
- **ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్‌పై ఇరువురిలో కనిపించిన ఆనందం**
- **సేవా యజ్ఞానికి అడ్డంకులు తొలగింపుపై ఫెర్రర్ కుటుంబం కృతజ్ఞతలు**
- **మీ సేవలు మరింత విస్తృతం కావాలని పరిటాల సునీత, శ్రీరామ్ ఆకాంక్ష**

ఫెర్రర్ కుటుంబ సభ్యులతో పరిటాల కుటుంబ సభ్యులు

అనంతపురం, మార్చి 26 ప్రభాతవార్త బ్యూరో

సంతోషం.. ఉద్వేగభరితమైన వాతావరణంలో ఆర్డీటీ వ్యవస్థాపకులైన ఫెర్రర్ కుటుంబంతో పరిటాల కుటుంబసభ్యుల ఆత్మీయ కలయిక చూడటానికి కన్నుల పండువగా కనిపించింది. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్‌కు అనుమతులిచ్చిన నేపథ్యంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్‌లు ఫెర్రర్ కుటుంబాన్ని కలిశారు. అనంతపురంలోని వారి నివాసానికి వెళ్లగా అన్నే ఫెర్రర్‌తో పాటు విశాల ఫెర్రర్ వారిని ఆహ్వానించి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎమ్మెల్యే సునీతను అన్నే ఫెర్రర్, విశాల ఫెర్రర్ ఆలింగనం చేసుకుని తమ సంతోషాన్ని పంచుకున్నారు. గత కొన్ని రోజులుగా ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ ఆగిపోవడంతో సేవా కార్యక్రమాలకు ఇబ్బందులు తలెత్తుతాయన్న ఆందోళన అందరిలో నెలకొంది. దాదాపు ఐదున్నర దశాబ్దాలుగా జిల్లాతో అవినాభావ సంబంధం కల్గిన అన్నేఫెర్రర్ కూడా ఈ విషయంలో ఆందోళన చెందారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్‌తో పాటు జిల్లాలోని కూటమి ప్రజాప్రతినిధులంతా ఢిల్లీ స్థాయిలో చేసిన కృషి ఫలితంగా ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్‌కు గ్రీన్ సిగ్నల్ లభించిందన్నారు. గత ఏడాదిగా జరిగిన పరిణామాలన్నింటినీ వారు చర్చించుకున్నారు. ఈ సందర్భంలో అన్నేఫెర్రర్ కొంత ఉద్వేగానికి గురయ్యారు. ఈ జిల్లా తమ కుటుంబం లాంటిదని.. ఇక్కడ సేవా కార్యక్రమాలు ఎప్పటికీ నిరాటంకంగా కొనసాగించాలన్నది ఫాదర్ ఫెర్రర్ ఆశయమని అన్నారు. ఐదున్నర దశాబ్దాలుగా సాగిన ప్రయాణం అలాగే గత ఏడాదిగా నెలకొన్న సంక్షోభాన్ని అన్నేఫెర్రర్‌తో పాటు విశాల ఫెర్రర్ సునీత, శ్రీరామ్‌తో పంచుకున్నారు. జిల్లాలో అందరి కృషితోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ చొరవతో ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ అయిందని వారు అన్నారు. పేరు పేరునా మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. అనంతరం వారు ఇరువురికి ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ.. ఆర్డీటీ సంస్థ గత కొన్ని దశాబ్దాలుగా అందిస్తున్న సేవాకార్యక్రమాలు వెలకట్టలేనివన్నారు. వ్యక్తిగతంగా తమ నియోజకవర్గాల్లో ఎలాంటి సాయం కావాలన్నా అప్పట్లో ఫాదర్ ఫెర్రర్ ఆ తర్వాత మాంచో, విశాల ఫెర్రర్లు వెంటనే స్పందించే వారన్నారు. ఆ కుటుంబంతో మాకున్న అనుబంధం చాలా ప్రత్యేకమన్నారు. ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ ఆలస్యమైన సమయంలో తమకు కూడా ఆందోళన ఉండేదని, కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాలోకేష్ చొరవతో అది సాధ్యమైందన్నారు. ప్రధాని మోదీతో పాటు హోం మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాలోకేష్‌లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆర్డీటీ సేవల్ని మరింత విస్తృతం చేసే దిశగా ఇక నుంచి అడుగులు పడాలని వారు ఆకాంక్షించారు.

అపహరించాడు..అంతమొందించాడు..!

❖ ఏడేళ్ల చిన్నారిని చిదిమేసిన కిరాతకుడు ❖ సినీ ఫక్కీలో అపహరణ..హత్య



కుందనకోట వద్ద రాళ్లకింద కప్పెట్టిన వేంచంద్ర మృతదేహం



వేంచంద్ర ఫైల్‌ఫోటో

తాడిపత్రి, మార్చి 26, ప్రభాతవార్త

మానవత్వం మంటగలిసిన ఆ మానవ మృగాన్ని చూసి అడవి మృగాలు కూడా సిగ్గుతో తల దించుకుంటాయి. అభం శుభం తెలియని ఏడేళ్ల చిన్నారిని అపహరించి, కొండగుట్టల్లోకి ఎత్తుకెళ్లి, రాళ్లతో కొట్టి చంపి తన కిరాతకత్వాన్ని చాటుకున్న ఓ కిరాతకుని ఉదంతం తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి మండలం కోనుప్పలపాడులో గురువారం వెలుగు చూసింది.

సినీ ఫక్కీలో జరిగిన చిన్నారి అపహరణ..హత్య స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు..యాడికి మండలం కోనుప్పలపాడు గ్రామానికి చెందిన గోవిందుకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు వేంచంద్ర ఉన్నారు. వేంచంద్ర యాడికిలోని వాగ్దేవి ఉన్నత పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. పెద్దకూతురు లలిత గతంలో ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్న నిట్టూరుకు చెందిన సర్వేష్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ నేపథ్యంలో బుధవారం సర్వేష్ ముఖానికి ముసుగు వేసుకొని ద్విచక్ర వాహనంలో వచ్చి కోనుప్పలపాడులో వేంచంద్ర పాఠశాల నుంచి వచ్చే బస్సు కోసం వేచి చూస్తున్నాడు. ఈ దృశ్యం కోనుప్పలపాడులో సిగరెట్, శీతలపానీయం తీసుకున్న ఓ దుకాణంలోని సీసీ కెమెరాలో రికార్డు కావడం విశేషం. పాఠశాల బస్సు దిగగానే వేంచంద్రకు డబ్బులిచ్చి కురుకురేలు తీసుకొని వచ్చి తన ద్విచక్ర వాహనం ఎక్కమనడంతో బావే కదా అనే నమ్మకంతో సర్వేష్ క్రూరత్వం తెలియక వాహనం ఎక్కాడు. బస్సు పోయినా తన కుమారుడు ఇంటికి రాకపోయే సరికి చిన్నారి తల్లి కాంతమ్మ ఆరా తీసింది. అక్కడే ఉన్న చిన్నారులు మునుగేసుకున్న వ్యక్తి వాహనంలో ఎక్కి వెళ్లాడని చెప్పారు. అనుమానమొచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. చిన్నారి అపహరణ విషయం దావానలంలా జిల్లా అంతటా వ్యాపించింది. ఎస్పీ జగదీష్ పలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పోలీసులు విచారిస్తున్న గ్రామస్థుల గుంపులో ఏమీ తెలియని అమాయకుని మాదిరిగా తన బావ మరిది కనిపించలేదని జనంతో పాటు ఫిర్యాదు చేశాడు. అనుమానం వచ్చిన పోలీసులు సర్వేష్‌ను తమ వాహనంలో ఎక్కించుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

కుందనకోట చుట్టూ కలకలం..!

పోలీసులు చేపట్టిన గాలింపు చర్యల్లో భాగంగా కుందనకోటలో నిందితుడు వాడిన, సీసీ ఫుటేజిలో కనిపించిన ద్విచక్రవాహనం లభ్యమైంది. సర్వేష్‌ను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని తమదైన శైలిలో విచారణ చేపట్టిన పోలీసులు చిన్నారి వేంచంద్ర ఆచూకీ చూపమని కుందనకోట పరిసర ప్రాంతానికి తీసుకొని వెళ్లారు. చీకటి పడటం, పోలీసులు కొద్దిగా అప్రమత్తతగా లేకపోవడంతో సర్వేష్ జారవిడుచుకొని పారిపోయాడు. పోలీసులు ఒకవైపు చిన్నారి ఆచూకీ కోసం, మరోవైపు నిందితుడిగా భావిస్తున్న సర్వేష్ కోసం మరింత ముమ్మరంగా గాలించారు. సర్వేష్ అటు తిరిగి ఇటు తిరిగి స్వగ్రామమైన నిట్టూరుకు చేరుకొని అతని చిన్నాన్న ఇంటిలో సేద తీరుతుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. సర్వేష్‌ను తీసుకొని తిరిగి కుందనకోట కొండగుట్టల్లోకి తీసుకొని పోయి చిన్నారి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి నిందితుడు చూపించిన ప్రాంతానికి వెళ్లగా రాళ్ల మధ్యన విగత జీవిగా పడి ఉన్న వేంచంద్ర కనిపించాడు. దీంతో పోలీసులు, చిన్నారి కుటుంబ సభ్యులు, బంధువులు హతాశులయ్యారు. రాళ్లను తొలగించి, మృతదేహాన్ని వెలికి తీసి కొండ మీద నుంచి బయటకి తెచ్చేలోగా వందలాది మంది జనం అక్కడికి చేరుకున్నారు. నిందితుడిని అక్కడిక్కడే కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున జనం కేకలు వేశారు. జనాన్ని అదుపు చేయడానికి పెద్ద ఎత్తున పోలీసులు సంఘటనా స్థలంలో మొహరించారు. చిన్నారిని ఆ స్థితిలో చూసిన ప్రతి ఒక్కరి కళ్లు చెమ్మగిల్లాయి. చిన్నారిని చంపిన ఆ మానవ మృగం మనుష్యుల మధ్య ఉండకూడదనే అరుపులు ఎక్కువగా వినిపించాయి. అక్కడి నుంచి చిన్నారి మృతదేహాన్ని తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడని సమాచారం.

వేంచంద్ర మృతదేహాన్ని తెస్తున్న బంధువులు



నిందితుడు సర్వేష్

చిన్నారి హత్యకు కారణమేంటి..?

తమకిష్టం లేకపోయినా తమ కూతురినిచ్చి అతనితో వివాహం జరిపించామని, కట్నం కింద ఇవ్వాల్సిన బంగారు కూడా తీసుకొని వెళ్లమని ఇటీవల పండుగకు తమ ఇంటికి వచ్చిన అల్లుడుతో చెప్పామని చిన్నారి తల్లి కాంతమ్మ మీడియాతో చెప్పింది. ఇటీవల పండుగకు వచ్చిన తన బావ సర్వేష్ పళ్లెంలోని మాంసాహారంలో తన కుమారుడు వేంచంద్ర వేలు పెట్టాడని మా పెద్ద కూతురైన తన భార్యతో చాలా నీచంగా మాట్లాడాడని ఆమె తెలిపింది. మా కుటుంబ సభ్యులందరినీ చంపేస్తానని అతనికి తెలిసిన వారితో వ్యాఖ్యానించినట్లు కూడా ఇటీవల మా చెవిన పడిందని, నా కొడుకును వాడు ఎలా చంపాడో పోలీసులు కూడా అతన్ని అలా చంపాలని ఆమె మీడియాతో మాట్లాడటం గమనార్హం.

కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు



యుద్ధం వద్దు.. శాంతి ముద్దు

28న ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం: యుజెఎసి కన్వీనర్ సి.జాఫర్

అనంతపురం, మార్చి 26 ప్రభాతవార్త బ్యూరో

ఈనెల 28/3/2026వ తేది శనివారం ఉదయం 10:30 గంటలకు ప్రెస్ క్లబ్‌లో ఇరాన్‌పైన అమెరికా ఇజ్రాయిల్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఎస్సీ, ఎస్టీ బీసీ సంఘాలు, స్వతంత్ర సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, యుజెఏసి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమా వేశం నిర్వహి స్తున్నట్లు యుజెఎసి కన్వీనర్ సి.జాఫర్ తెలియజేశారు. యుద్ధం వల్ల పశ్చిమ ఆసియా భగ్గుమం టోందన్నారు. బాంబులతో క్షిపణులతో 28 రోజులుగా పరస్పరం దాడులు చేసుకుంటున్నారు. ఫిబ్రవరి 28వ తేదీ అమెరికా ఇజ్రాయిల్, ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీని, భార్య కుటుంబ సభ్యులతో సహా 40 మంది కమాం దర్లను చంపడం జరిగింద న్నారు. అంతేకాకుండా వరుసగా 19 మంది అగ్రశ్రేణి ఇరాన్ లీడర్లను హతమార్చి అమెరి కాకు అనుకూల మైన ఏజెంటును ఇరాన్‌లో కూర్చోబెట్టి పరిపాలన చేయాలని కలలుగన్నది. బాలికల పాఠశా లపైన బాంబులు వేసి 165 మంది పిల్లలను పొట్టన పెట్టుకోవడం జరిగిందని, పశ్చిమాసియా చమురుపైన ఆధిపత్యం కోసం అమెరికా దుర్మార్గమైన చర్యలు చేపడుతోందన్నారు. అదేవిధంగా నరహంతక ఇజ్రాయిల్ దేశం ప్రపంచ పటములో పాలస్తీనను లేకుండా చేయాలని పిల్లలు, మహిళలు, ఆసుపత్రులపైన బాంబులు వేసి 70వేల మందిని పొట్టన పెట్టుకున్నది. (యుద్ధం వద్దు శాంతి ముద్దు) ఇరాన్ పైన అమెరికా ఇజ్రాయిల్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడమైనది. కావున యుద్ధాన్ని వ్యతిరేకించే వారు ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

02ATP27_02ATP27.qxd 26-03-2026 PM 10:19 Page 1

సంకల్పంతోనే ఆశయ సాధన సాధ్యం

డి.హిరేహాళ్ మార్చి 26 ప్రభాతవార్త

విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్

సంకల్పంతోనే విద్యార్థులు తమ ఆశయ సాధన సాధ్యమవుతుందని లేబర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం డి.హిరేహాళ్ మండలం కల్యం గ్రామంలోని బాలమేధావి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ పాఠశాల కరస్పాండెంట్ వన్నూరుస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో లేబర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యా ప్రమాణాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆశయ సిద్ధి ఉన్నతంగా నిర్ణయించుకోవాలని, అప్పుడే రామాణికమైన విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ జీవితాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దుకుంటూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చిన వారవుతారని ఆయన పేర్కొన్నారు. మార్కుల కోసం వేట కొనసాగించకుండా జ్ఞానం కోసం వేట కొనసాగించాలని, ఎవరైతే తల్లిదండ్రులు చెప్పిన మాటకు అనుగుణంగా నడుచుకుంటారో వారి జీవితం ఎప్పుడూ ఉజ్వలంగా ఉంటుందన్నారు. మనకు చిన్ననిప్పు చిన్నవెలుతురుని ఇస్తుందని,పెద్ద నిప్పు పెద్ద వెలుతురుని ఇస్తుందని అదేవిధంగా మన ఆశయం ఉన్నతంగా ఉండాలని ఆయన విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశలో 5జి 4జి లను కాకుండా ఉత్తమ బోధనను అందించే గురువులను నమ్ముకుంటే మీ జీవితంలో ఎక్కడ తప్పుటడుగు వేయకుండా సురక్షితమైన మార్గంలో పయనించి మీరు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆయన విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు తమ గురువులు చెప్పిన విధంగా నడుచుకోవాలని దీంతో సురక్షితమైన జీవన విధానంతో పాటు ఉన్నత స్థాయి పొందుతారని ఆయన వివరించారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గాలంటే మన ప్రణాళిక ఏ విధంగా ఉండాలి. మనకు ఏరంగంలో ఎక్కువగా రాణించగలమని, వాటిని ఎలా తెలుసుకోవాలి అన్న అంశాలపై అనేకమైన ప్రశ్నలకు ఆయన విద్యార్థులకు సమాధానాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడతు మీ విలువైన సమయాన్ని మా విద్యార్థుల కోసం వెచ్చించి వారిలో నిగూఢంగా ఉన్న అనేకమైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి నివృత్తి చేయడంతో సంతోషమైన విషయమని ఆయన కొనియాడారు. తమ విద్యార్థులకు మీ అమూల్యమైన సూచనలు చేసినందుకు విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు, పాఠశాల యాజమాన్యం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఆయన చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం అందరూ కలిసి కమిషనర్ గారిని ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అసిస్టెంట్ కమిషనర్ సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఈనెల 29 న వివేకానంద ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు

మీడియాకు వెల్లడించిన అడ్వకేట్ మల్లారెడ్డి

న్యాయవాది మల్లారెడ్డి

కంబదూరు, మార్చి 26, ప్రభాతవార్త

కంబదూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలోఉన్న ప్రాథమిక పాఠశాల నందు ఈనెల 29వతేదీన వివేకానంద మిషన్ ట్రస్ట్వారిఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు న్యాయవాది బి కే .మల్లారెడ్డి ఒక ప్రకటనలో గురువారం మీడియాకు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్ల నొప్పులకు ఉచితంగా మందులు ఇవ్వబడునని చెప్పారు. కుందుర్పి మండలం బసాపురం గ్రామం వాస్తవ్యులైన తమ తల్లిదండ్రులు స్వర్గస్తులైన వీఆర్ఓ సతీమణి ప్రమీళ, రామలింగారెడ్డి జ్ఞాపకార్థంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు న్యాయవాది మల్లారెడ్డి వెల్లడించారు. కావున ఎముకలు, కీళ్ల నొప్పుల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ముగ్గురు కవలలకు జన్మనిచ్చిన తల్లిని పలకరించిన వైద్యాధికారి

హాస్పిటల్లో చలివేంద్రం ప్రారంభం

కవల పిల్లల తల్లికి జాగ్రత్తలు చెప్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం మార్చి 26 ప్రభాతవార్త

మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నందు వేసవిని దృష్టిలో పెట్టుకొని వైద్యధికారి డాక్టర్ రాజేష్ కుమార్ చలివెంద్రం ప్రారంభించారు ఈ సందర్భంగా వైద్యాదికారి మాట్లాడుతూ ఎండలు తీవ్రమైనదున ఆరోగ్య కేంద్రం నందు రోగులను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలియ చేసారు అనంతరం బ్రహ్మసముద్రం మండలం నంజాపురమ్ గ్రామానికిచెందిన కవితరమేష్ అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో జనవరి 19వతేదీన ముగ్గురు కవలలకు జన్మనిచ్చింది నంజపురం గ్రామానికి తల్లిదండ్రుల ఇంటిని గురువారం ఉదయం మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల ఆరోగ్య స్థితిగతుల గురించి వాకబు చేశారు. కవలల తల్లిదండ్రులైన కవిత రమేష్ లకు శిశువుల ఎదుగుదల వారి ఆరోగ్యం గురించి సూచనలు ఇచ్చారు. శిశువులలో ఒక పాపకు కంటికి సంబంధించిన ఒక చిన్న లోపం ఉందని గ్రహించి కడపలోఉన్న పుష్పగిరి కంటిఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి చికిత్స చేయవలసిందిగా తెలిపి శిశువు తండ్రికి తీసుకువెళ్లాలని సూచించారు. పుట్టినప్పుడు చాలా తక్కువ బరువు ఉన్న శిశువులు ఇప్పుడు దాదాపు కేజీ బరువు పెరిగారని వారియొక్క పూర్తిఆరోగ్య బాధ్యత తాము తీసుకుంటామని కంగారు పడవలసిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేరు అసిస్టెంట్ ఎగ్జామ్స్ హెల్త్ అసిస్టెంట్ జాన్సన్ ఆశా వర్కర్ లక్ష్మి అంగన్వాడి కార్యకర్త చంద్రమ్మ పాల్గొన్నారు.

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు దుర్గం విద్యార్థుల ఎంపిక..

రాయదుర్గం టౌన్ మార్చి 26 (ప్రభాతవార్త):

రాయదుర్గం కే టి ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు క్రీడా జి.పల్లవి, తృతీయ బి.యస్సి,యమ్.వసంత ప్రథమస్థానంలో సౌత్జోనల్ సెంట్రల్ కోకో పోటీలకు ఎంపిక కావడం గర్వకారణం అని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాసులు ఆశాభావం వ్యక్తంచేశారు.డిగ్రీకళాశాల అధ్యాపకులతో గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడారంగంలో కళాశాలవిద్యార్థినులు రాణిస్తుండడం కళాశాలకు గర్వకారణమని ఎస్కేయూనివర్సిటీ తరపున ఇద్దరు కోకోమహిళా క్రీడాకారులు ఈకళాశాలద్వారా ఎంపికకావడం కళాశాలతరపున ఎంపికైన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. కళాశాల అధ్యాపకులతో విద్యార్థులకు సన్మానిస్తూ అభినందనలు తెలిపారు, ఈ ఇద్దరూ అమ్మాయిలు విశ్వవిద్యాలయంలో జరిగే క్రీడా శిబిరం నందు పాల్గొని మంచి ప్రతిభను కనబరిచి కళాశాలకు పేరు తెస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

చిన్నారి కేయాన్ష్ వైద్యానికి రూ.10 వేల ఆర్థిక సాయం

లేపాక్షి, మార్చి 26 ప్రభాతవార్త

ఆర్థికసాయం అందచేస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన లేపాక్షిలో అరుదైన "స్పైనల్ మస్కులర్ అట్రోఫీ" (ఎస్ఎంఏ) టైప్-2 వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఓ చిన్నారి కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం తమ వంతు సాయంగా గురువారం 10 వేల రూపాయల ఆర్థికసాయాన్ని చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఈడిగ సంఘం నాయకులు మాట్లాడుతూ అత్యంత ఖరీదైన ఈ వ్యాధి చికిత్సకు సామాన్య కుటుంబం అంత మొత్తాన్ని భరించడం సాధ్యం కాదని, దాతలు మానవత్వంతో స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పిలుపునిచ్చారు. చిన్నారి త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమంలో శివశంకరగౌడ్, బాలాజీగౌడ్, మోహన్, ఈశ్వర్గౌడ్, విశ్వనాథ్గౌడ్, సాయికృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో నేడు సీతారాముల కళ్యాణోత్సవం

లేపాక్షి, మార్చి 26 ప్రభాతవార్త

మండల కేంద్రమైన లేపాక్షిలోని కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక కళ్యాణార్థం నిర్వహించే ఈ వేడుక ఉదయం 10 గంటలకు ప్రారంభమై, మధ్యాహ్నం ఒంటి గంట వరకు శాస్త్రోక్తంగా కొనసాగనుందన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. లేపాక్షి వెంకటనారాయణప్ప కుటుంబసభ్యులు, బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ కల్యాణ వేడుకకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. భక్తాదులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించి పునీతులు కావాలని వారు కోరారు.

రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గుత్తి, మార్చి 26 ప్రభాతవార్త

శ్రీరామునికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని కోటలో వెలసిన పురాతన రామస్వామి ఆలయంలో గురువారం సీతారామ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆలయంలో అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, సంప్రోక్షణ పూజలు గావించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వ్యవసాయ కూలీలతో వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తా

-మహిళా కూలీ మృతి, ఐదుగురు కూలీలు, డ్రైవర్కు తీవ్రగాయాలు

-నింబగల్లువద్ద ఆగివున్న ఇసుక ట్రాక్టర్లను తప్పించబోయి ప్రమాదం

ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త

ప్రమాదంలో మృతి చెందిన హసీనమ్మ, ప్రమాదానికి గురైన ఆటో

ప్రమాదంలో గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యవసాయ కూలీలు, ఆటో డ్రైవర్ దృశ్యాలు

మండల పరిధిలోని నింబగల్లు గ్రామ సమీపంలో గురువారం ఉదయం జరిగిన ప్రమాదంలో వ్యవసాయ కూలీలతో వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడగా అందులో ప్రయాణిస్తున్న కణేకల్లు మండలం హనకనహాల్ గ్రామానికి చెందిన హసీనమ్మ (45) అనే మహిళ మృతి చెందింది. ప్రమాదంలో మరో ఐదుగురు మహిళా కూలీలతోపాటు ఆటో డ్రైవర్కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు, పోలీసుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే...కణేకల్లు మండలం హనకనహాల్ గ్రామానికి చెందిన కూలీలతో ఉరవకొండ మండలం నెరమెట్ల గ్రామంలో మిరప పంట కోతలకు వెళుతున్న ఆటో నింబగల్లు గ్రామ సమీపానికి చేరుకోగానే రోడ్డుపై ఆగివున్న రెండు ఇసుక ట్రాక్టర్లను తప్పించే క్రమంలో ఒక్కసారిగా బోల్తాపడింది. దీంతో హసీనమ్మ అనే కూలీ అక్కడికక్కడే మృతి చెందగా లక్ష్మి, వరలక్ష్మి, రామలక్ష్మి, పద్మ, నిర్మలతోపాటు ఆటో డ్రైవర్ సురేష్కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108కు సమాచారం అందించగా అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించింది. కాగా గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు సూచనల మేరకు మెరుగైన చికిత్సకై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. హసీనమ్మ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టకు రంగం సిద్ధం

- నూతన వేదికపై ఘనంగా ఏర్పాటు

కళ్యాణదుర్గం, మార్చి 26 ప్రభాతవార్త

మహర్షి శ్రీ వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కోసం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం పట్టణానికి ఆధ్యాత్మిక శోభను తీసుకురానున్న వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపనకు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్వంత నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేసి నిర్మించిన నూతన వేదికపై మహర్షి వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని టిడిపి నాయకులు, కార్యకర్తలు గురువారం చేపట్టారు. వాల్మీకుల ఆరాధ్య దైవం, రామాయణ రచయిత మహర్షి వాల్మీకికు ఘన నివాళిగా అత్యాధునిక నమూనాతో ఆకర్షణీయంగా విగ్రహాన్ని తయారు చేయిస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే నిలబెట్టుకున్నారు. స్థానిక వాల్మీకి సర్కిల్లో ప్రత్యేక డిజైన్తో నిర్మించిన వేదికపై సుమారు ఆరు అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు సిద్ధం చేశారు. ఆధ్యాత్మికతను ప్రతిబింబించే విధంగా రూపొందించిన ఈ వేదికపై విగ్రహ ప్రతిష్ట అనంతరం వాల్మీకి సర్కిల్కు కొత్త అందం చేకూరనుంది. శాస్త్రోక్త విధానంలో, శుభ ముహూర్తంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు చేతుల మీదుగా విగ్రహాన్ని ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు, పట్టణ ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రతి ఇంటా సుఖ శాంతులు విరజిల్లాలి

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి (కలెక్టరేట్), మార్చి 26, ప్రభాతవార్త

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆదర్శ పురుషుడు శ్రీరామచంద్రుని ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు, సౌభాగ్యాలు విరాజిల్లాలని ఆకాంక్షించారు. ధర్మం, సత్యం, క్రమశిక్షణ వంటి విలువలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆయన కోరారు.

నీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు

అగళి, మార్చి 26 ప్రభాతవార్త

బోరుకు పంపు సెట్ను అమర్చి నీటిని వదులుతున్న దృశ్యం

సమస్య ఎక్కడుంటే అక్కడికి వాలిపోతారు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి. గత 10 రోజులుగా నియోజకవర్గంలో నీటి సమస్య ఎక్కడుంటే అక్కడికి వెళ్లి సమస్యను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. బోరు తవ్వకానికి ఏ గ్రామానికి అవసరం ఉందో ఆ గ్రామానికి బోర్వెల్ను పంపిస్తూ ఒకపక్క కొత్తమోటారు పంపుసెట్టు పైపులను సరఫరా చేయిస్తూ నీటి సమస్యను పరిష్కరిస్తున్నారు. ఇటీవల మండలంలో వద్రహట్టి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించారు. ఈ రోజు నర్సాంబుది గ్రామంలో నీటి సమస్య నెలకొని ఉంటే అక్కడ బోరుకు కొత్తమోటారు పంపుసెట్ను పైపులను వదిలి నీటి సమస్యను పరిష్కరించారు. వేసవి కాలంలో సుడిగాలి పర్యటన చేస్తూ సమస్యలు పరిష్కరించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జయరామ్, నారాయణప్ప, గోవిందు, మంజునాథ్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం...!..

ప్రజలకు కూటమి నాయకులు సూచన..

ధర్మవరం రూరల్ మార్చి 26 ప్రభాతవార్త

మూడు చక్రాలు సైకిళ్లను సిబ్బందికి అందిస్తున్న కూటమి నాయకులు

మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కొని ఆరోగ్యంగా ఉందామని మంత్రి కార్యాలయ ఇన్చార్జ్ హరీష్ బాబు, తెదేపా క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి ప్రజలకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో తడి పొడి చెత్త సేకరణ కోసం 20 గ్రామ పంచాయతీలకు మంజూరు చేసిన మూడు చక్రాల సైకిల్లను వారి చేతుల మీదుగా వెంకటేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పల్లెలు పట్టణానికి పట్టుకొమ్మలన్నారు. గ్రామీణ ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పంచాయతీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. వీరి ఆదేశాల మేరకు ప్రతి గ్రామపంచాయతీలో ఇంటింటా చెత్త సేకరణ చేయడానికి ప్రత్యేకంగా మూడు చక్రాల వాహనాలను అందిస్తున్నారన్నారు. వీటిని దుర్వినియోగం చేయకుండా ఆయా పంచాయతీ కార్యదర్శులు చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు. మురుగునీటి, తడి, పొడి చెత్తను సక్రమంగా సేకరణ చేసి పల్లెల్లో వర్మి కంపోస్టు యాడ్ ద్వారా సంపద సృష్టించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి అబ్దుల్ నబీ, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డ్ డిప్యూటీ ఎంపీడీవో శేషావలి, మాజీ జెడ్పిటిసి సభ్యులు రామాంజనేయులు, గొట్లూరు శీన, ఏలుకుంట్ల రమణ, విజయ సారధి, ఆ దెప్పా నాయుడు, జంగం నరసింహులు, బిజెపి నాయకుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామములో తెదేపా జెండా ఎగరాలి : కన్వీనర్ వన్నారెడ్డి

కనేకల్లు మార్చి 26 ప్రభాతవార్త

కనేకల్లు మండలంలోని ప్రతి గ్రామంలోనూ తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఎర్రగుంట వన్నారెడ్డి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా కన్వీనర్ వన్నారెడ్డి మాట్లాడుతూ మార్చి 29వ తేదీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కణేకల్ మండలం ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేయాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యులు కాలవశ్రీనివాసులు ఆదేశించారు అన్నారు. కావున మీగ్రామంలో ఈనెల 28వ తేదీలోపల జెండా ఎగురవేయడానికి జెండా దిమ్మెలు ఏర్పాట్లు చేసుకోని 29 వ తేదీ ఆదివారం పార్టీ ఆవిర్భావ కార్యక్రమాన్నివిజయవంతం చేయవలసిందిగా కార్యకర్తలకు అయిన సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్లు, యూనిట్ ఇంచార్జ్లు, డైరెక్టర్లు, బిఎల్ఓలు, గ్రామ కమిటీ మెంబర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి అన్నారు. ప్రతి గ్రామంలోనూ ఆ గ్రామ కమిటీ అధ్యక్షులు చే జెండా ఆవిష్కరణ చేయవలెను సూచించారు.

తాగునీటి సరఫరా స్టీల్ ట్యాంకర్ల కొనుగోలుకు కొటేషన్ల ఆహ్వానం

పుట్టపర్తి, మార్చి 26, ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లాలో వేసవి కాలం దృష్ట్యా తాగునీటి సమస్య నివారణకు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు, 5000 లీటర్ల సామర్థ్యం గల స్టెయిన్లెస్ స్టీల్ ట్యాంకర్ల కొనుగోలుకు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కార్యాలయం కొటేషన్లను ఆహ్వానిస్తోంది. 5000 లీటర్లు సామర్థంతో (ఎస్ ఎస్ 304 జి మెటీరియల్), ట్యాంకర్ మందం 3.2 ఎం ఎం, డబుల్ యాక్సిల్ సెమీ ట్రైలర్, 12 నెలల వారంటీ కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల తయారీదారులు/సరఫరాదారులు తమ కొటేషన్లను సీల్డ్ చేసిన కవరులో మార్చి 30, 2026 లోపు పుట్టపర్తి లోని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పారదర్శకమైన ప్రమాణాలతో ఈ కొనుగోలు ప్రక్రియ నిర్వహించబడుతుందనీ ఆ ప్రకటనలో తెలియజేశారు. మరిన్ని వివరాలకు ఏవో వంశీ కృష్ణ 97039 19823 నెంబర్ కు సంప్రదించాలన్నారు.

ఉపాధి హామీలో అవినీతి, అక్రమాలపై డ్వామా ఏపీడీ విచారణ

-బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని దిగమింగిన సొమ్ము రికవరీ చేయాలి -ఏపీడీను కలిసి విన్నవించిన సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఉపాధిహామీ అధికారులతో మాట్లాడుతున్న సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు

ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త

ఉరవకొండ మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు సంబంధించి 2024-25, 2025-26 సంవత్సరాల్లో జరిగిన పనుల్లో అవినీతి అక్రమాలపై డ్వామా ఏపీడీ అయేషా గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం పనులపై 18, 19 విడతల్లో జరిగిన సామాజిక తనిఖీల్లో లక్షలు, కోట్ల రూపాయల్లో అవకతవకలు జరిగాయని తనిఖీ బృందాలు తేల్చగా అధికారులు లక్షలాది రూపాయలు రికవరీకు ఆదేశించినా రికవరీలు, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి పిర్యాదులు చేసిన క్రమంలో ఈ విచారణ కొనసాగింది. ఏపీడీ అయేషా ఎంపీడీవో రవిప్రసాద్తో కలిసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీడీ అయేషాను కలిసిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి పెద్దముష్టూరు వెంకటేశులు మాట్లాడుతూ 18వ విడత సామాజిక తనిఖీకు సంబంధించి లక్షల్లో అవినీతి జరుగగా ఇప్పటి వరకు కేవలం 61వేల రూపాయలు మాత్రమే రికవరీ చేశామని చెబుతున్నారని, నేటికీ ఎవరిపైనా చర్యలు తీసుకోలేదన్నారు. 19వ విడత సామాజిక తనిఖీలోనూ కోటి రూపాయలకు పైగానే అవకతవకలు జరుగగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలే లేవన్నారు. కూలీల డబ్బులు దోచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దోచేసిన సొమ్మును అణాపైసలతో సహా రికవరీ చేయాలన్నారు. దీంతో ఏపీడీ అయేషా మాట్లాడుతూ నాలుగు రోజుల్లో అవినీతి సొమ్మును రికవరీ చేసి కేసుల నమోదుకు పీడీకు నివేదిక సమర్పిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శీనప్ప, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ వద్ద సిట్టింగ్ బెంచ్ లను ఏర్పాటు

పుట్టపర్తి, మార్చి 26, ప్రభాతవార్త

సామకోటి ఆదినారాయణను సన్మానిస్తున్న దృశ్యం

సిట్టింగ్ బెంచ్ లను ఏర్పాటు చేసిన దృశ్యం

జిల్లా కేంద్రంలోని అన్న క్యాంటీన్ కు ప్రతి రోజు రైతులు, వృద్ధులు, ప్రజలు అనునిత్యం భోజనం నిమిత్తం వస్తున్న వారికి కూర్చోవడానికి వీలుగ తెలుగుదేశం పార్టీ నాయకులు సామకోటి ఆదినారాయణ గ్రీన్ భారత్ ఆధ్వర్యంలో నాలుగు సిట్టింగ్ బెంచ్ లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ పాల్గొన్నారు. సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజలు అనునిత్యం అన్న క్యాంటీన్ కు వచ్చే వారిని దృష్టిలో పెట్టుకుని వారికి వీలుగా సెట్టింగ్ బెంచులను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ బాబుల స్పూర్తితో పి 4 కింద ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్టు రిచ్ కార్యక్రమాన్ని చేపట్టినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంటీన్ నిర్వాహకులతో పాటు బీసీ నాయకుడు శంకర్, మోహన్, శివ, నారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామం హలుకూరు సందర్శన

అమరాపురం మార్చి 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈవో శివశంకర్ ,డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి త్రాగునీరు దాదాపుగా 6 నెలల నుండి మండలంలో గ్రామాలలో ప్రజలకు అందడం లేదని ఈ సందర్భంగా పాత్రికేయులు సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. కళ్యాణదుర్గం నుంచి నేరుగా అమరాపురం హిందూపురం ప్రాంతానికి వెళుతుందని తక్షణం స్థానిక ఈఈ , శ్రీరామరెడ్డి ఇంజనీర్లతో మాట్లాడి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని చెత్తా సేకరణ కేంద్రాలలో హేమావతి పంచాయతీలో చెత్తా సేకరణ కేంద్రం ఒక్కటి మాత్రమే పనిచేస్తుందని మిగిలిన ఎస్డబ్ల్యూ పిసి సెంటర్లను సక్రమంగా నిర్వహించడానికి కృషి చేయాలని సీఈఓ డిప్యూటీ ఎంపీడీవోను ఆదేశిస్తూ వారం పది రోజుల్లో చెత్త సేకరణ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. హలుకూరు గ్రామం ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజనానికి ఎంపికైనందున దాదాపు కోటి రూపాయలతో పనులను మంజూరు కొరకు ప్రభుత్వ ఆమోదం కొరకు ప్రతిపాదన సిద్ధం చేయాలని ఆదేశించారు. మెరుగైన వసతులు కల్పించాలని ఈ సందర్భంగా ఎంపీడీవో రామారావుని కోరారు.. హలుకూరు గ్రామాలలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, వాటర్ ప్లాంట్, విద్యుత్ దీపాలు, అంగన్వాడీ భవనాలు, పంచాయతీ కార్యాలయంలో ఉన్నటువంటి ట్రాక్టర్లను సచివాలయం కార్యాలయాల ముందు ఉంచాలని డిప్యూటీ ఎంపీడీవోను ఆదేశించారు. అంబాసిడర్లకు, నైపుణ్యాలను నేర్పించి, అదనంగా వారికిచ్చే వేతనం కంటే అదనంగా 2000 రూపాయలు ఇస్తే వారి ట్రాక్టర్ డ్రైవర్లుగా ఉపయోగించుకోవచ్చని ఈ సందర్భంగా తెలిపారు. హలుకూరు గ్రామానికి ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో హలుకూరు గ్రామపంచాయతీకి కావలసిన నిధులను సిద్ధం చేసి పంపించాలని పంపించాలని ఈ సందర్భంగా ఎంపిడిఓ రామారావు , డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ ను ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్ , పంచాయతీరాజ్ ఏఈ పవన్ , ఆర్డబ్ల్యూఎస్ రఘు కోరారు. మరియు హేమావతి సిద్దేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించినారు. ప్రధాన అర్చకులు శివకుమార్ స్వామి, కమిటీ చైర్మన్ కరేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ సీఈఓ దృశ్యం

సీతాస్వయంవర అలంకారంలో కోదండరాముడు

తాడిపత్రిఅర్బన్, మార్చి 26 ప్రభాతవార్త

శ్రీరామున్ని సీతాస్వయంవరంగా అలంకరించిన దృశ్యం

పట్టణంలోని మెయిన్‌బజార్ లో వున్న ఆర్‌వి స్వామి కళ్యాణమండపంలో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా గురువారం రామ చంద్రుడు సీతాస్వయంవర అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించు కున్నారు. హాజరైన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వి స్వామి కళ్యాణమండపం పాలకవర్గం అధ్యక్షులు వంకదారి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు కామిశెట్టి నాగభూషణం, కార్యదర్శి కొత్తవెంకట ఆదినారాయణ, సంయుక్త కార్యదర్శి పెండేకంటి చంద్రశేఖర్, కోశాధికారి కామిశెట్టి కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

మాదిగల చైతన్యసదస్సును విజయవంతం చేయండి

మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

యాడికి, మార్చి 26 ప్రభాతవార్త

ఏపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజన్న ఆదేశాల మేరకు తలపెట్టిన మాదిగల చైతన్య సదస్సుకు పెద్దఎత్తున మాదిగలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ రాయలసీమ జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మహేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం సదస్సుకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగ బిడ్డలపై జరుగుతున్న దాడులు, భూ సమస్యలు, తదితర వాటిపై తలపెట్టిన చైతన్య సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మేకల మహేంద్ర, మేకల మస్తాన్, రామయ్య, శింగలమల సురేష్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీరామనవమి వేడుకలు

తాడిపత్రిఅర్బన్, మార్చి 26 ప్రభాతవార్త

వాల్మీకిమహర్షి విగ్రహం వద్ద అలంకరించిన దృశ్యం

పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో వున్న వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద సీతారామ లక్ష్మణ సమేత వాల్మీకి మహర్షి విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించ నున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డిలు హాజరవుతారన్నారు. కావునా పెద్దఎత్తున భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని సీతారాములు, వాల్మీకి మహర్షి ఆశీస్సులు పొందాలన్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

పురవీధుల్లో చౌడేశ్వరిదేవి తేరు ట్రయల్ రన్

రథం ట్రైల్‌రన్ నిర్వహిస్తున్న దృశ్యం, ప్రహరీగోడలను తొలగిస్తున్న దృశ్యం

అమడగూరు, మార్చి 26 ప్రభాతవార్త

అమడగూరు ప్రధాన రహదారుల్లో గురువారం చౌడేశ్వరిదేవి తేరు ట్రయల్ రన్ నిర్వహించారు. మార్గంలో ఎక్కడ ప్రహరీ గోడలు అడ్డు వస్తాయోనన్న ముందు ఆలోచనతో అమ్మవారి తేరును ట్రయల్ రన్ నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త పొట్ట పురుషోత్తంరెడ్డి తెలిపారు. ముఖ్యంగా అడ్డుగా నిర్మించిన ప్రహరీ గోడలు, విద్యుత్ స్తంభాల లైన్లను అక్కడికక్కడే తొలగించే ప్రయత్నాలు చేశారు. గతంలో ఎన్నో నెలలుగా ప్రహరీ గోడలు అడ్డుగా నిర్మించిన వారికి చెప్పిన వారు పట్టించుకోవడంలేదన్నారు. ఇది అమ్మవారి జ్యోతి మహోత్సమని లక్షలాదిమంది తరలివస్తారని కేవలం మన సొంత లబ్ధి కోసం కాదని అమ్మవారి జ్యోతి తేరు ఉత్సవాలకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. అమ్మవారి ఉత్సవాలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఏప్రిల్ 5న జరిగే చౌడేశ్వరిదేవి జ్యోతి తేరు ఉత్సవానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి లక్షలాదిమంది భక్తాదులు తరలివస్తారని వారికి అన్ని విధాలుగా సౌకర్యాలు, అన్నదాన కార్యక్రమాలు, తాగునీటి వసతి కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్‌పిటిసి కవిత శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ గోపాలకృష్ణ, పోలీస్ సిబ్బంది, సర్పంచు రాజు, సురేందర్‌రెడ్డి, ఆమదుదూరు సర్పంచు షబ్బీర్, రాజారెడ్డి, పెద్దక భాస్కర్‌రెడ్డి, రాజు, భాస్కర్‌రెడ్డి, కాసుల శంకర, కాసుల వెంకటరమణ, ఇండ్లూరి వెంకటరమణ, ఇండ్లూరి లచ్చి, వెంకటేష్, డైమండ్ మణికంట, ప్రతాప్, రాజు శ్రీకాంత్, అశోక్, అమడగూరు, చీకరేవులపల్లి, గుండువారిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

అబాకస్‌లో విజేతగా నిలిచిన సుహన

పుట్లూరు, మార్చి 26 ప్రభాతవార్త



హైదరాబాద్‌లో జరిగిన అబాకస్ పోటీల్లో పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన విద్యార్థిని గవ్వల సుహన విజేతగా నిలిచి ట్రోఫీ అందుకుంది. విద్యార్థిని సుహన తాడిపత్రి మండలం రావివెంకటాంపల్లిలోని సాయిభవిత ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. విజేతగా నిలిచిన విద్యార్థిని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

◄ ట్రోఫీని చూపుతున్న సుహన

పాలీసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

తాడిపత్రిఅర్బన్, మార్చి 26 ప్రభాతవార్త

10వ తరగతి పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులకు పాలీసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివరామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఏప్రిల్ 4 నుండి కళాశాల అధ్యాపకులతో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత స్టడీ మెటీరియల్ అందచేస్తామన్నారు. ఏప్రిల్ 25వతేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలీసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫీజు ఓసి, బిసిలకు 400 రూపాయలు, ఎస్‌సి, ఎస్‌టిలకు 100 రూపాయలు వుంటుందన్నారు. మరిన్ని వివరాలకు 7901620198, 9989160103కు సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

కొండకమర్లలో ఆపరేషన్ వజ్రప్రహార్

- శాంతిభద్రతల పరిరక్షణ, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చడే లక్ష్యం
- సిఐ శ్రీనివాసులు, ఎస్సై మల్లికార్జునరెడ్డి

ఓబుళదేవరచెరువు, మార్చి 26, ప్రభాతవార్త

ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

మండలంలోని కొండకమర్లలో గురువారం నల్లమాడ సిఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆపరేషన్ వజ్రప్రహార్ కార్యక్రమంలో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అంకితా సురానా పర్యవేక్షణలో పోలీసులు ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా ఎస్సై మల్లికార్జున రెడ్డి నేతృత్వంలో మెరుపు దాడులు చేపట్టారు. డ్రోన్ కెమరాల ద్వారా పోలీసు ప్రత్యేక బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొని వాహనాలు, రౌడీ షీటర్లు, పాత నేరస్థులు, అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ధృవీకరణ పత్రాలు లేని 10 వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ, ఎస్సైలు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, మత్తు పదార్థాల రహితా జిల్లా మార్చడే లక్ష్యం పోలీసులు పనిచేస్తున్నారన్నారు. ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించినప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. ప్రజా చైతన్యం-ప్రతిజ్ఞ, ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై ప్రతిజ్ఞ చేయించారు. అత్యవసర సమయాల్లో 112, ఈగల్ టోల్‌ఫ్రీ 1972కు డయల్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చునని తెలియచేశారు. శాంతిభద్రత లకు విఘాతం కలిగించే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని వారు హెచ్చ రించారు. ఈ కార్య క్రమంలో నల్లమాడ ఎస్సై సతీష్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

నారాలోకేష్‌కు రుణపడి ఉంటాం

మాట్లాడుతున్న పల్లెపు సోమశేఖర్

కదిరి, మార్చి 26 ప్రభాతవార్త

వడ్డెర్లకు ఇచ్చిన మాట ప్రకారం క్వారీల్లో 50 శాతం రాయితీ ప్రకటించడంపై నారాలోకేష్‌కు రుణపడి ఉంటామని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పల్లెపు సోమశేఖర్ పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో వడ్డెర్లకు క్వారీల్లో 50 శాతం రాయితీ, సంఘాలు 10 శాతం క్వారీలు కేటాయించడం, సినారస్ చార్జీలు పన్నులు 50 శాతం చెల్లించాలని క్యాబినెట్‌లో ఆమోదించడం పట్ల చాలా సంతోషించ దగ్గ విషయమన్నారు. జీవితాంతం రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర్లంతా తెలుగుదేశం పార్టీకి రుణపడి ఉంటామని, ఈ నిర్ణయం తీసుకోవడంపై పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా వడ్డెర్లు హర్షం వ్యక్తం చేశారు.

మోదీ, చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం

కదిరి, మార్చి 26 ప్రభాతవార్త

ప్రధాని, ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బిజెపి, జనసేన పార్టీ నాయకులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలకు విద్య, వైద్యం, వ్యవసాయం కోసం సేవలు అందిస్తున్న ఆర్డీటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్ధరణ కొరకు కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం వెలువడింని సందర్భంగా దేశ ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిసీఎం పవన్ కళ్యాణ్, ఐటి శాఖ మంత్రి నారాలోకేష్ అభినందనలు తెలుపుతూ గురువారం పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద వారి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఉమ్మడి అనంతపురంజిల్లాలోని ఆర్డీటి సంస్థకు సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఏ చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో ఒప్పించడానికి రాష్ట్ర నాయకత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. బిజెపి, జనసేన నాయకుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ఉత్తమరెడ్డి, జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జ్ భైరవ ప్రసాద్, నాయకులు రవికుమార్, సుదర్శన్, చిన్న న్నపరెడ్డిలు పాల్గొన్నారు.

కార్డెన్ సెర్చ్, నాకాబంది నిర్వహించిన పోలీసులు

కార్డెన్ సెర్చ్, నాకా బంది నిర్వహిస్తున్న పోలీసులు

నంబులపూలకుంట, మార్చి 26 ప్రభాతవార్త

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఎన్‌పికుంట ఎస్సై, గాండ్లపెంట ఎస్సై, తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో విధ ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్, నాకాబంది నిర్వహించారు. గంజాయి కేసులో ఉన్నటువంటి ముద్దాయిలు, దొంగతనం కేసులో ఉన్నటువంటి ముద్దాయిల ఇండ్లను చెక్ చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఎవరి మీదైనా అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. అసాంఘీక కార్యకలాపాలకు చెక్ పెట్టాలంటే ముందుగా ప్రజల సహకారం ఎంతో అవసరమని అప్పుడు ఇటువంటివి 100 శాతం కట్టడి చేయగలమని వారు ఈ సందర్భంగా తెలియజేశారు.

పంచాయతీ కి పన్ను చెల్లించిన సి ఆర్ టీ ఐ టీ కాలేజీ యజమాన్యం

అనంతపురం రూరల్, మార్చి 26 ప్రభాతవార్త:

పన్నుకు సంబంధించిన చెక్కును అధికారులకు అందిస్తున్న దృశ్యం

అనంత రూరల్ మండలం రాచానపల్లి గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన పన్నును పంచాయతీ అధికారులకు సి ఆర్ ఐ టీ కాలేజీ యజమాన్యం చిరంజీవరెడ్డి చెక్కును అందించడం జరిగిందని డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు, రాచానపల్లి గ్రేడ్2పంచాయతీ అభివృద్ధి అధికారి సర్దార్ వలి తెలిపారు. గ్రామంలో ఇంటి పన్నులు చెల్లిం చని వారి ఇంటివద్దకు వెళ్లిపన్ను వసూలుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో ఉన్న సి ఆర్ ఐ టీ కాలేజీ యజమాన్యం పంచాయతీకి చెల్లించాల్సిన రూ. 6,33,981 పన్నును పంచాయతీకి గురువారం చెల్లించడం జరిగిందన్నారు. పంచాయతీ లోని నివసించే ప్రజలతో పాటు, ప్రవేట్ కళాశాలలు, పాఠశాలల యజమానులు కూడా సకాలంలో పెండింగ్ ఉన్న ఇంటి పన్నులు నీటి, ఇతర పన్నులు చెల్లించి గ్రామ పంచాయతీకి ఆదర్శంగా నిలవాలన్నారు. గ్రామంలోని ప్రజలతో ఈ నెలలోపు వసూలు చేయించాలని కమిషనర్, కలెక్టర్,డిపిఓ, ఎంపీడీఓ,దేశాలు ఇవ్వడం జరిగిందని వారి ఆదేశాల మేరకు గ్రామంలో ఎవరైనా ఇంకా ఇంటి పన్ను నీటి పన్ను చెల్లించని వారు ఉంటే ఈ నెలలో పు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని వారు గ్రామ ప్రజలను కోరారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్న, గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రజలందరూ సకాలంలో పన్నులు చెల్లిస్తేనే అభివృద్ధి పనులు చేయడానికి వీలుంటుందని కావున ఇంకా ఎవరైనా ఇంటి, నీటి,ఇతర పనులు చెల్లించకపోతే తప్పకుండా చెల్లించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పన్ను వసూలు చేసే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బలో అన్ని ఎక్స్‌ప్రెస్ రైలు ఆపాలని రైల్వే బోర్డు సభ్యుల వినతి

సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే బోర్డు సభ్యులు

ముదిగుబ్బ, మార్చి 26, ప్రభాతవార్త

మండల కేంద్రమైన ముదిగుబ్బలో అన్ని ఎక్స్‌ప్రెస్ రాయలను ఆపాలని స్థానిక రైల్వే బోర్డు సభ్యులు రైల్వే అధికారులకు గురువారం వినతిపత్రం అందించారు. ముదిగుబ్బలోని రైల్వే స్టేషన్ వద్ద బోర్డు సభ్యులు మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ చౌదరి సోమల ప్రకాష్ పలువురు ప్రజా నాయకులు సమావేశమై వినతిపత్రాన్ని రైల్వే స్టేషన్ మాస్టర్కు అందించారు. ఈ సందర్భంగా రైల్వే బోర్డుసభ్యులు ప్రకాష్ మాట్లాడుతూ ముదిగుబ్బ రైల్వే స్టేషన్లో రోజుకు సుమారు 6 నుంచి ఏడు రైళ్ల వెళుతున్నాయన్నారు అయితే కేవలం ఒక నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఈ స్టేషన్ వద్ద నిలబడుతుందని మిగతా రైళ్ల మాత్రం ఇక్కడ ఆగకుండా పోవడంతో ప్రయాణికులుతీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దిగుబ మండలంలో సుమారు 70 వేల మంది జనాభా ఉన్నారని ఈజనాభామాత్రమే కాకుండా చుట్టుపక్కల బుక్కపట్నం పులివెందుల గ్రామాల నుండి కూడా ప్రజలు విశ్లేషణ వద్ద రైల్వే ప్రయాణం కోసం వస్తున్నారన్నారు అయితే ఈ ప్రయాణికులకు సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు ధర్మవరం పుట్టపర్తి అంటే స్టేషన్కు వెళ్లి అలా ప్రయాణం చేయాల్సి వస్తోంది అన్నారు ఇది ప్రయాణికులకు చాలా ఇబ్బందిగా మారిందని ప్రస్తుతం ప్రజలు ముదిగుబ్బ రైల్వే స్టేషన్లో ఎక్కడికెక్కడ రైళ్ల లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అందుకే అన్ని ఎక్స్‌ప్రెస్ లైలను మరియు బస్ స్టేషన్లో నిలిపి ప్రయాణికుల సౌకర్యం కోసం చర్యలు తీసుకోవాలని మేము రైల్వే అధికారులకు కోరుకుంటున్నామని వారు తెలిపారు. ఇప్పటికే అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం వారి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమాజానికి కీలకమైన రైల్వే మార్గం. ఈ అభ్యర్థన పరిష్కరించకపోతే సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మరింత ఇబ్బంది పెరగడం ఖాయం ముదిగుబ్బ రైల్వే స్టేషన్ వద్ద ఉండే రైళ్ల ఆగుదల వల్ల ప్రజలు వృధా ప్రయాణం సమయం శక్తి మరియు ఖర్చు కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు దీనిపై రైల్వే అధికారులు ఆలోచించి ప్రజల సౌకర్యార్థం రైళ్లను నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు

ఆర్డీటికి ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతి హర్షనీయం

-ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బి.రాంప్రసాద్‌నాయక్

మాట్లాడుతున్న రాంప్రసాద్‌నాయక్

తనకల్లు, మార్చి 26 ప్రభాతవార్త

ఆర్డీటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతి మంజూరు చేయడం హర్షనీయమని ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బి.రాంప్రసాద్‌నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల గుండెల్లో ఆర్డీటి సంస్థ చెరగని ముద్ర వేసుకుందన్నారు. తనకల్లు మండల పరిధిలోని దళిత గిరిజనలు, ప్రజలు ఆర్డీటి సంస్థకు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. ఎంతో దళిత గిరిజనులకు, నిరుపేదలకు ఆర్డీటి సంస్థ ద్వారా సేవలందిస్తుండడం పట్ల సంస్థ వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతారన్నారు. ఆర్డీటికి ఎఫ్‌సిఆర్‌ఏ కొనసాగించడం సంతోషకరమన్నారు. దీంతో ప్రతి గ్రామంలోనూ పండుగ వాతావరణం నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఫెర్రర్ కుటుంబాన్ని కలిసిన ఎంఎస్ఎస్ఎస్ సంఘం నాయకులు

ఫెర్రర్ కుటుంబాన్ని కలిసిన ఎం ఎస్ ఎస్ ఎస్ సంఘం నాయకులు

అనంతపురం రూరల్, మార్చి 26 ప్రభాతవార్త

ఆర్ డి టీ సంస్థకు యఫ్ సి ఆర్ ఏ రెన్యూవల్ మంజూరు కావడంతో మాదిగ సంక్షేమ సేవా సంఘం ఎం ఎస్ ఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు సాకే రామతీర్థ, జిల్లా అధ్యక్షులు మన్నల సుబ్రమణ్యం తదితరులు ఆర్డీటీ మాంచో ఫెర్రర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఆయన భార్య విశాల్ ఫెర్రర్ కూడా పాల్గొన్నారు. నాయకులు వారికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్ డి టీ సంస్థ ఎన్నో సంవత్సరాలుగా జిల్లాలో పేదలు, రైతులు, మహిళలు, దివ్యాంగులు, విద్యార్థులకు చేస్తున్న సేవలు అపూర్వమని కొనియాడారు. యఫ్ సి ఆర్ ఏ రెన్యూవల్ ద్వారా సంస్థ సేవలు మరింత విస్తృతంగా కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో వేలాది కుటుంబాలకు ఆర్ డి టీ ఆధారం కాగా, ఈ నిర్ణయం వారికి కొత్త ఆశలను నింపిందన్నారు. భవిష్యత్తులో కూడా సంస్థ మరింత సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కోటంక మల్లేష్, సి. నాగరాజు, సి. శంకరయ్య, చంటి, రానా ప్రతాప్ పాల్గొన్నారు.

నేడు బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు

మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు

తాడిపత్రిఅర్బన్, మార్చి 26 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయంలో శ్రీసీతారాముల విగ్రహాలకు అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా చేసిన వేదికపై శ్రీసీతారాముల విగ్రహాలకు వేద పండితులు శాస్త్రోక్తంగా కళ్యాణం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కళ్యాణాన్ని వీక్షించి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. ం. కళ్యాణోత్సవం అనంతరం హాజరైన వారికి అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్‌ని కలిసిన మహర్షి వాల్మీకి సేవ దళ్ కమిటీ సభ్యులు

అనంతపురం రూరల్, మార్చి 26 ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్ ను కలిసిన మహర్షి వాల్మీకి సేవాదళ్ కమిటీ సభ్యులు

జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ను అనంత జిల్లా మహర్షి వాల్మీకి సేవాదళ్ కమిటీ సభ్యులు గురువారం ఆయన చాంబర్లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పం గుచ్ఛం అంద జేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని పవర్ ఆఫీస్, దగ్గర ఉన్నటు వంటి వాల్మీకి విగ్రహం దగ్గర వాల్మీకి జయంతి కార్యక్రమం జరిగి నప్పుడు అక్కడికొచ్చేటు వంటి మంత్రులు ఎమ్మెల్యేలు జిల్లా అధికారులతో పాటు వాల్మీకి కులబంధువు లందరికీ అక్కడ స్థల సమస్య చాలా ఇబ్బందిగా ఉన్నదని విగ్రహం చుట్టూ ఇరవై అడుగులు స్థలం కావాలని కలెక్టర్,నికోరగాసానుకూలంగా స్పందించి ఇది కచ్చితంగా నేను మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి కచ్చితంగా క్లియర్ చేస్తానరన్నారు.కమిటీ సభ్యులను సాదరంగా ఆహ్వానించి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని మీ యొక్క సమస్యను కచ్చితంగా పరిశీలిస్తానని మాట ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలోమహర్షి వాల్మీకి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి అక్కులప్ప,మహర్షి వాల్మీకి సేవాదళ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోగటం రవి,మహర్షి వాల్మీకి సేవాదళ్ జిల్లా అధ్యక్షులు భాను కోట శివ, మహర్షి వాల్మీకి సేవాదళ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు చిల్లా కృష్ణవేణి,మహర్షి వాల్మీకి సేవదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ రామాంజనేయులుతదితరులు పాల్గొన్నారు

గ్రామ సచివాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు

అనంతపురం రూరల్, మార్చి26 ప్రభాతవార్త

చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అనంత రూరల్ మండలం రాచానపల్లి, కురుకుంట గ్రామ పంచాయితీలలో ని సచివాలయాల వద్ద పంచాయితీ అభివృద్ధి అధికారి సర్దార్ వలి, టీడీపీ రైతు సంఘం అధ్యక్షులు నారాయణ స్వామి,పార్టీ నాయకులతో కలసి గురువారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత ఆదేశాల మేరకు రెండు గ్రామ సచివాలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎండలు తీవ్రత ఎక్కువ అయిందని వీటీ వలన సచివాలయాలకు వచ్చే ప్రజలు దాహంతో ఇబ్బంది పడకుండా గ్రామాలోని సచివాలయాల వద్ద చల్లి వేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు నిత్యం తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది. పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నెలరోసులకే గుంతలు పడిన కామారుపల్లి తారురోడ్డు

- నాసిరకం తారు రోడ్డు వేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి : గ్రామ ప్రజలు

అనంతపురం రూరల్, మార్చి 26 ప్రభాతవార్త



కామారు పల్లి గ్రామానికి వెళ్లే తారు రోడ్డు గుంతలు ఏర్పడి పెచ్చులు లేసిన దృశ్యం

కళ్యాణదుర్గం మెయిన్ రోడ్డు నుంచి అనంత రూరల్ మండలం కామారుపల్లి గ్రామానికి పోవడానికి వేసిన తారురోడ్డు నెల రోజులు కాకముందే గుంతలమయంగా మారింది. రూ.90లక్షల వ్యయంతో తారురోడ్డు వేశారు. నాణ్యతలేని తారురోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రూ.90 లక్షల వ్యయంతో వేసిన తారురోడ్డు నాసిరకంగా మారడంతో ఆ డబ్బు బూడిదలో పోసిన పన్నీరుగా మారిందిని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. వేసిన తారురోడ్డుకు ఇంకా క్వాలిటీ చెక్కింగ్ చేయకుండనే గుంతలు పడి పెచ్చులు పెచ్చులు లేస్తోంది. బలమైన వర్షాలు మూడు రోజులు కురిస్తే వేసిన తారురోడ్డు ఆనవాళ్లు లేకుండా పోతుందని అంటున్నారు. నాసిరకం తారురోడ్డు వేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు జిల్లా అధికారులను కోరారు.

ఆలమూరులో వేరుశనగ పంట కోత ప్రయోగం

అనంతపురం రూరల్, మార్చి 26 ప్రభాతవార్త

వేరుశనగ పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంత రూరల్ మండలం ఆలమూరు రెవిన్యూ గ్రామం లో సర్వే నంబర్ 491 నందు జీ.నర్సమ్మ సన్నాఫ్ నాగన్న వేరుశనగ పంటను సాగు చేయడం జరిగినదని వేరుశనగ పంట కోత ప్రయోగం 5.5 మీటర్ల లో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ పంట కూత ప్రయోగమునకు సూపర్వైజర్ ఆఫీసర్గా మండల వ్యవసాయ అధికారి ఏ వెంకట కుమార్ హాజరై 5..5 మీటర్ల లో పంటకోత ప్రయోగం చేయగా 5.100 కే జె లు దిగుబడి వచ్చినదని దీని ప్రకారం ఎకరాకు పచ్చి వేరుశనగ కాయలు 19.5 బస్తాల దిగుబడి రావడం జరిగినది పచ్చి శనిక్కాయలను ఎండబెట్టిన తర్వాత డ్రై వెయిట్ 12 బస్తాలు ఎకరాకు వస్తాయని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి భాగ్యశ్రీ విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ విజయభాస్కర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

సీతారాముల కళ్యాణోత్సవానికి పిలుపునిచ్చిన మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు

నల్లచెరువు మార్చి 26 ప్రభాత వార్త

ముస్తాబైన సీతారాముల మూల విరాట్

మండల పరిధిలోని పుణ్యక్షేత్రమైన శ్రీ పాలపాటి దీన్ని ఆంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో వెలసిన సీతారాముల దేవస్థానం నందు సీతా రాముల వారి కళ్యా ణోత్సవం జరిపించటం జరుగుతుందని మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు. ప్రకటన తెలిపారు కావున గ్రామ ప్రజలు భక్తాదులు అందరూ విరివిగా పాల్గొని స్వామివారి కళ్యాణోత్సవంను అందరూ తిలకించి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ప్రత్యేక అలంకరణలో సీతా రాములు చూడ ముచ్చట జంటను దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

VEHICLES FOR SALE

AP39TM7183 - Mahindra Bolero Pickup 1.7/2020,
AP39TM0555 - TATA LPT 4825 BS IV/2021,
AP02 TC4416 Bharth Benz 1215/2015
Models is for sale in as is where is condition.
Kanakadurga Finance Limited,
PH: 99635 17999

04ATP26_04ATP26.qxd 26-03-2026 PM 11:22 Page 1

వాడ వాడలా పార్టీ జెండా ఎగరాలి - శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు

రాప్తాడు, మార్చి 26 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజు పార్టీ జెండా వాడ వాడనా ఎగరాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. అనంత పురంలోని తన క్యాంప్ కార్యాల యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుక లపై పార్టీ నాయకు లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్చార్జిలు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ నెల 29న ఆవిర్భావ దినోత్సవం రోజున ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న దానిపై చర్చించారు. నియోజకవర్గ, మం డల, గ్రామ కమిటీలను పూర్తి చేయాలని.. ఇందులో పార్టీ కోసం పని చేసిన వారికి, భవిష్యత్‌లో చురుగ్గా పని చేసే వారికి అవకాశం ఉండాల న్నారు. ప్రతి పోలింగ్ బూత్ లోను చురుకైన బీఎల్ఏ లను నియమిం చాలన్నారు. పార్టీ ఏ పిలుపునిచ్చినా.. గ్రామ స్థాయి నుంచి పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేలా ఉండాలన్నారు. మరోవైపు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ విష యంలో ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు

పీ4 అమలు ఏడాది వేడుకపై అధికారులతో సమీక్ష : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4జీరో పార్టనర్ కార్యక్రమం అమలు ఏడాది పూర్తైన సందర్భంగా ఎమ్మెల్యే సునీత సమీక్ష నిర్వహించారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

పార్టీ ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న పరిటాల సునీత

తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి రామ్మోహన్, రాప్తాడు ఎంపీడీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047, పి4-జీరో పార్టనర్షిప్ కార్యక్రమం అమలై ఏడాది పూర్తైన సందర్భంగా మార్చి 31న ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శులు, బంగారు కుటుంబాలు భాగస్వా ములు కావాలన్నారు. వారితో పరస్పర చర్చలు నిర్వహించి, ఇంకా ఎలాంటి కార్యక్రమాలు చేయాలన్నదానిపై చర్చించాల్సి ఉంటుందన్నారు. అలాగే మార్గదర్శులకు సత్కార కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. భవిష్యత్‌లో ఈ కార్యక్రమంలో మరి కొంత మంది మార్గదర్శులను భాగస్వామ్యం చేసేలా అధికారులు చొరవ చూపాలన్నారు. రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత తెలిపారు.

ఉడాన్ పథకంలో జిల్లాలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయండి

- కేంద్ర మంత్రిని కోరిన బిజెపి సెల్స్ కన్వీనర్ కనంపల్లి చిరంజీవిరెడ్డి

అనంతపురం సిటీ, మార్చి 26 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రాంతీయ అనుసంధానత పథకం (ఉడాన్)లో భాగంగా వెనుకబడిన అనంతపురం జిల్లాలో విమానాశ్ర యాన్ని ఏర్పాటు చేయాలని బిజెపి సెల్స్ కన్వీనర్ కనంపల్లి చిరంజీవిరెడ్డి కోరారు. తన వ్యక్తిగత కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో ఉడాన్ పథకానికి కేంద్ర ప్రభుత్వం రూ.28,840 కోట్లు కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. ఈ పథకం ద్వారా వెనుకబడిన ప్రాంతాలలో విమానయాన రంఘం అభివృద్ధి చేసి సామాన్యులు సైతం విమాన ప్రయాణం చేయాలన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పం అన్నారు. ఈ పథకంలో భాగంగా వెనుకబడిన అనంతపురం ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేసి విజ యవాడ, విశాఖపట్నం, చెన్నై ప్రాంతాలకు విమానాల కనెక్టివిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు లేఖ సైతం రాయడం జరిగిం దన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో విమాన యాన రంగంతో పాటు రవాణా రంగాల అభివృద్ధి శరవేగంగా జరుగు తోందని ఆయన కొని యాడారు. ఈ సం దర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థికపై ఎఫ్‌సి ఆర్‌ఏ నిధులను కొనసాగిస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాన మంత్రికి కేంద్ర హోమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మాట్లాడుతున్న బిజెపి సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి

గ్రేటర్ నోయిడాలో తరంగణి-2026 ఉగాది సంబరాలలో ఎంపి అంబికా

అనంతపురం, మార్చి 26 ప్రభాతవార్త బ్యూరో

గ్రేటర్ నోయిడాలోని శారదా విశ్వవిద్యాలయంలో తెలుగు కమ్యూనిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన తరంగణి-2026 ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యా లయ ప్రతినిధులు ఎంపికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన తెలియజేస్తూ..తెలుగు సంప్రదాయాలు, సంస్క ృతిని దూర ప్రాంతాల్లో కూడా ఇంత అందంగా నిలబెట్టుకుంటూ ఉత్సాహంగా జరుపుకుంటున్న విద్యార్థులను చూసి చాలా సంతోషంగా ఉందని ఆయన ఆనందాన్ని వ్యక్త పరిచారు.

ఎంపి అంబికా లక్ష్మినారాయణను సన్మానిస్తున్న నోయిడా శారద విశ్వవిద్యాలయ ప్రతినిధులు

జల్ జీవన్ మిషన్ నుండి రాయదుర్గం కు రూ.9355కోట్ల మంజూరు

హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం మార్చి 26 ప్రభాతవార్త

జల్ జీవన్ మిషన్ ద్వారా రాయదుర్గం నియోజకవర్గంకు 7 ఏం వి ఎస్ ప్రాజెక్టులకు రూ.9,355 కోట్ల పరిపాలనా అనుమతి ఇవ్వడం ఎంతో సంతోషకరమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధమైన త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గురువారం జి.ఓ. నెం. 53 జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తపరిచారు. జల్ జీవన్ మిషన్ కింద రాయదుర్గం నియోజకవర్గాన్ని ఎంపికచేస్తూ రూ.390 కోట్ల నిధులు కేటాయిస్తూ, రాష్ట్ర కేబినేట్ ఇదివరకే నిర్ణయం తీసుకుం దన్నారు. సదరు నిర్ణయానికి సంబంధించి గురువారం అధికారిక ఉత్తర్వులు ఇవ్వడం సంతోషదాయకమన్నారు.

దీనివల్ల రాయదుర్గం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొ న్నారు. రోజుకు ఒక్కో వ్యక్తికి 55 లీటర్ల త్రాగునీరు అందించేందుకు ప్రభు త్వం చర్యలు తీసుకుంటు ంద న్నారు. ఈ కీలక నిర్ణయం తీసుకున్న ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సం బంధిత మంత్రులు, అధికారులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలి పారు. ప్రభుత్వం గ్రామీణ అభి వృద్ధికి కట్టుబడి ఉండి ప్రజల జీవన ప్రమా ణాలను మెరు గుపర్చడానికి తీసుకుం టున్న చర్యలు అభినంద నీయమన్నా రు. చంద్రబాబు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వ పాలనలో భవి ష్యత్తు లో ఇలాంటి ప్రజాహిత కార్య క్రమాలు మరెన్నో కొనసాగుతా యనే ఆశాభావం కాలవ వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు

ఘనంగా అఖండ రామ భజన

అనంతపురం, మార్చి 26 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం నగరం పాతఊరులో గల శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో 24 గంటలపాటు శ్రీరామ నామ సంకీర్తన కార్యక్రమం ఘనంగా సాంప్ర దా య బద్ధంగా నిర్వహించారు. గురువారం ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన అఖండ దీపము వెలిగించి, శ్రీరామచంద్రుల చిత్రపటమునకు విశేష పూజలు నిర్వహి ంచారు. కార్యక్రమ నిర్వాహకులు బుశెట్టి రమణమూర్తి, శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చల్లా కృష్ణ రంగ య్య, ధర్మకర్త గర్రాల నాగరాజు దంపతులు, వాస వి భజన మండలి శ్రీధర్, వాసవి మహిళా మండలి అధ్యక్షు రాలు చెల్లా స్వర్ణలత, ముంటిమడుగు నాగరాజు, ముంటి మడుగు సావిత్రి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వివిధ భజన సంఘాల ప్రతినిధులు, వివిధ సత్సంగ మండలుల ప్రతినిధులు, వివిధ దేవాలయాల కమిటీల ప్రతినిధులు, కలవల నాగమణి, సొరిగారి ఉమామహేశ్వర్, కటకం కృష్ణవేణి, కెవిఎస్ చలపతి రెడ్డి, తది తరులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీరామనామ సంకీర్తన భక్తిపారవశ్యంతో ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా బుశెట్టి రమణమూర్తి మాట్లాడుతూ.. గత 15 సంవత్స రముల నుండి క్రమం తప్పకు ండా 24 గంటల శ్రీరామ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. శ్రీరామనవమి పర్వదినమున ప్రతి ఒక్కరూ శ్రీ రామచంద్రల నామ స్మరణ చేయాలనే సత్సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, నగరంలో ఉన్న భజన సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతంగా చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించడంపై బుశెట్టి రమణమూర్తి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

అఖండ రామ భజనలో పాల్గొన్న వారు

నియోజవర్గ ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి టౌన్, మార్చి 26, ప్రభాతవార్త

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి లు శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీరాముని పాలనను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంచి సుపరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆదర్శ పురుషుడు శ్రీరామచంద్రుని ఆశీస్సులు ముఖ్యమంత్రి చంద్రబాబు కు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఉండాలని అలాగే ఈ రాష్ట్ర ప్రజలు సుభిక్ష ంగా ఉండాలని ,ప్రతి ఇంటా సుఖశాంతులు, సౌభాగ్యాలు విరాజిల్లాలని వారు ఆకాంక్షి ంచారు.శ్రీ రాముడు చూపిన మార్గం ధర్మం, సత్యం, క్రమశిక్షణ వంటి విలువలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు కోరారు.

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె

ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

అనంతపురం న్యూటౌన్, మార్చి 26 ప్రభాతవార్త

ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌ని భారత్ బహుజన ఫ్రంట్ భారత్ బహుజన ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి నగర పవన్ కుమార్ ఆధ్వర్యంలో కోరారు. ఏప్రిల్ 9న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి ఉందని, ప్రభుత్వ లాంఛనాలతో ప్రభుత్వమే అధికారికంగా ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యేని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని శనివారం జరగబోయే అసెంబ్లీ సమావేశంలో ఈ విషయాన్ని చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో కోశాధికారి కాశీం ఉపాధ్యక్షులు జూటూరు రామాం జనేయులు, వడ్డే మధు, బుడగ జంగాల రాష్ట్ర నాయకులు అం జి, నగర సంగం ఉపాధ్య క్షులు సుకుమార్, బిబిఎఫ్ సలహాదా రులు నాగన్న, బిబిఎఫ్ నాయకులు రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆర్ఓ ప్లాంట్స్ నిర్వహణపై ఓరియంటేషన్ ప్రోగ్రాం

అనంతపురం న్యూటౌన్, మార్చి 26 ప్రభాతవార్త

జిల్లా సైన్స్ సెంటర్‌లో ఆరో ప్లాంట్ల నిర్వహణకు సంబంధించి 107 మంది హెడ్మాస్టర్స్‌కి ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌ని నిర్వహించారు.

ఈ సందర్భంగా 107స్కూ ల్‌లకు ఆర్ఓ ప్లాంట్ సప్లై చేసిన ఆహ్లాద ఆరో ప్లాంట్ కంపెనీ, ఇన్నోవేటివ్ ఆరో ప్లాంట్ కంపెనీ వాళ్ళు డెమో ద్వారా ఆరోఓ ప్లాన్‌ని ఏ విధంగా నిర్మించుకోవాలి అనే విషయంపైన అవగాహన కల్పించారు. ఈ మీటిం గ్‌కు సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, ఇంజనీర్ రమణారెడ్డి, అసిస్టెం ట్ ఎఎంఓ నారాయణస్వామి, ఏపీవో నారాయణ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపిసి శైలజ మాట్లాడు తూ.. ఆరో ప్లాంట్ నిర్వహణ సరిగా లేకపోవడం వలన పిల్లలు తాగునీటి ఇబ్బంది పడుతున్నారు. అలాంటి స్కూల్స్ ఏమైనా ఉంటే మాదృష్టికి తెస్తే సంబంధించి కంపెనీ వాళ్ళతో మా ట్లాడి వెంటనే పరిష్కరిస్తామ న్నారు. అసిస్టెంట్ ఎఎంఓ నారాయ ణస్వామి అనంతపురం జిల్లాలో వాటర్ ప్లాంట్ సప్లై చేసిన ప్రతి కంపెనీ తోనూ ఆ స్కూల్ హెడ్ మాస్టర్‌కి అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామని తెలియ జేశా రు. ఏపీ నారాయణస్వామి మాట్లాడు తూ.. చిన్న సమస్యలు ఏమైనా ఉంటే సంబం ధిత హెడ్మాస్టర్ స్కూల్ నుంచి ఖర్చు చేసుకోవా ల్సి ఉంటుంది. పెద్ద సమస్యలు ఏమైనా ఉంటే ఎస్ఎస్సి తరఫున పరిష్కరిస్తామని చెప్పారు.

ఓరియెంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎపిసి శైలజా

శ్రీరామనవమి మహోత్సవ రథయాత్ర నిర్వహణకు విరాళం

అనంతపురం వైద్యం మార్చి 26 ప్రభాతవార్త

శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9.11 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి భారీ బైక్ ర్యాలీ నిర్వహిం చనున్నారు. ఈ శోభాయాత్రలో జనసేన పార్టీ తరఫున భారీగా పాల్గొనాలని కోరుతూ.. జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ ను గురువారం స్థానిక అహుడా కార్యాలయంలో శ్రీరామ ఉత్సవ సమితి అధ్యక్షులు శబరి వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, కోశాధి కారి ఇతను జైన్, ఉపాధ్యక్షులు గల్లా హర్ష మర్యాదపూర్వకంగా కలిశారు. సనాతన ధర్మ పరిర క్షణకు జనసేన అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఈ మహోత్సవంలో జనసేన పార్టీ తరఫున భారీగా పాల్గొంటామని టిసి వరుణ్ తెలిపారు. ఈ వేడుకల నిర్వ హణకు తనవంతుగా రూ. 25 వేలు భూరి విరాళాన్ని ఉ త్సవ కమిటీ సభ్యులకు అందజే శారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు టీసీ వరు ణ్‌ను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో శ్రీరామ ఉత్సవ కమిటీ సభ్యులు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అహుడ చైర్మన్ టిసి వరుణ్ ని సన్మాని స్తున్న శ్రీరామ నవమి రథయాత్ర నిర్వాహకులు

ఆర్డీటీ విజయోత్సవ సభను విజయవంతం చేయండి

- అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సాకే హరి

అనంతపురం న్యూటౌన్, మార్చి 26 ప్రభాతవార్త

పేద ప్రజల ఐక్య పోరాట ఫలితమే ఆర్డీటీకి మరిన్ని సేవలు చేసే అవకాశం దక్కిందని అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సాకే హరి పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందున్న ఫాదర్ విన్సెంట్ పెర్రర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు జీవనాడి, కల్పతరువుగా సేవలందించిన ఆర్డీటి లేకుండా పోతుందేమోనని ఆందోళన చెందామన్నారు. ఆర్డీటీని కాపాడుకోవడానికి కుల, మతాలకు అతీతంగా 11నెలలు ఐక్యమై ఉద్యమాలు చేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి అఖిలపక్ష కమిటీ ఉద్యమాభి వందనాలు తెలియజేస్తోందని ఈ విజయం వారికే అంకిత మన్నారు. భవిష్యత్తులో పేద ప్రజల అభివృద్ధి, చైతన్యానికి సేవలు చేసే భాగ్యం దక్కిందన్నారు. ప్రజా పోరాట ఉద్యమాల స్ఫూర్తితోనే ఆర్డీటీకి విదేశీ నిధులు రావడానికి అడ్డంకి తొలగిపో యిందన్న సంతోషంతో 29న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం ముందు విజయోత్సవ సభ నిర్వహి స్తున్నా మన్నారు. కార్యక్రమ ంలో అఖిలపక్ష కమిటీ నాయకులు దూదేకుల ఖాస్సీ సాబ్, సుగామంచి శ్రీనివాసులు, కేపీ రాజు, టీవి రెడ్డి, అనిల్ కుమార్, ఉమా మహేశ్వరి, శిరీశాల అంజి, వసంత్ కుమార్, మన్నెపాకుల మాధవ్, కృష్ణారెడ్డి, భీమ్ సేనాచారి, విశ్వనాథ్, శేషు, శ్రీధర్, తిప్పన్న పాల్గొన్నారు.

ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

వంద మీటర్ల దూరంలోపు అంగళ్ళు ఉండాలి

అనంతపురం క్రైమ్ మార్చి 26 ప్రభాతవార్త

అనంతపురం పట్టణంలోని 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై రామకృష్ణ, ఆరోగ్య అధికారి శ్రీరాములు ఈగల్ సెల్ ఎస్సై హనుమంతు సిబ్బంది పాల్గొన్నారు. పాఠశాలలు, కళా శాలల పరిసర ప్రాంతాల్లో (100 మీటర్ల లోపల) ఉన్న బడ్డీ కొట్టులు, కిరాణా దుకాణాలు తదితర వ్యాపార సంస్థలను తనిఖీ చేశారు. దుకాణదారులకు విద్యాస ంస్థల సమీపంలో పొగాకు ఉత్ప త్తుల అమ్మకం చేయడం దివిగిశిత చట్టం ప్రకారం నేరమన్నారు. నియ మా లు ఉల్లంఘించిన వారిపై జరిమా నాలు విధించారు. ఈ తనిఖీల లో ఎటువంటి మాదక ద్రవ్యాల కు సంబంధించిన పదార్థాలు గుర్తించబడ లేదన్నారు. ప్రజ లు, ముఖ్యంగా విద్యార్థుల ఆరో గ్యం దృష్ట్యా, ఇటువంటి చట్టవి రుద్ధ కార్యకలా పాలపై కఠిన చర్యలు కొన సాగుతాయని అధికారులు తెలిపారు.

పొగాకుకు వ్యతిరేకంగా పోస్టర్లు ఆవిష్కరించిన అధికారులు

సామాజిక తనిఖీ పై ప్రజావేదిక

బుక్కరాయసముద్రం మార్చి 26 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల పరిదిలోని 19 గ్రామ పంచాయితీల నందు జరిగిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల పై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించారు.

గురువారం బుక్కరా యసముద్రం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాల యం ఆవరణంలో సామాజిక తనిఖీల పై ప్రజావేదిక నిర్వహించారు.ఈ సందర్భంగ పంచాయితీల వారిగా గ్రామాల్లో జరిగిన పనుల గురించి డిఆర్‌పిలు వివరిం చారు.అందులో ముఖ్యంగా చాలా ప్రాంతాల్లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులు నిర్వహించే ప్రాం తాల్లో మౌళిక వసతుల్లో భాగంగా మెడికల్ కిట్లు, తాగునీరు,ఓఆర్ఎస్ ప్యాకిట్లు అందుబాటులో లేవని తెలపడంతో దానికి సంబందించి డ్వామా పిడి సలీంభాష మౌళిక వసతులను తక్షణమే ఏర్పాటుచేయాలని సంబందిత అధికారులను హెచ్చరించా రు.వాటితోపాటు కొన్ని గ్రామ పంచాయితీల్లో మస్టర్‌ల్లో లబ్దిదారుల సంత ృకాలు లేకుండనే బిల్లులు చెంల్లించారని డిఆర్‌పిలు తెలిపా రు. మొత్తం 19 పంచాయితీలకు గాను 5466 597 రూపాయల పని చేయడం జరిగింది. అందులో 2,77 ,458 రూపా యలు అవి నీతి జరిగిందని, పొరపా ట్లువలన చేసిన పనులకు 104600 రూపాయలు పినాలి టీలు వేయడం జరిగింది.

ఈ కార్యక్ర మంలో పిడి సలీం భాష,ఎంపీపీ దాసరి సునీత, ఎంపిడివో సాల్మన్, ఏఎ ోలు సుజాత, పోలేరయ్య, టిఏలు కుళ్ళాయి స్వామి, హనుమంతురెడ్డి ,ఏపీడీలు, ఫీల్డ్ అసిసెంట్లు ఎస్ఆర్ పిలు, డిఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పై ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

బచ్‌పన్ ప్లే స్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు, యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్

అనంతపురం కల్చరల్, మార్చి 26 ప్రభాతవార్త

రామన్‌నగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు నేడు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో విద్యార్థులు తమ అద్భుతమైన ప్రతి భను, సాంస్క ృతిక ప్రదర్శనలను కనబరిచి అంద రినీ ఆకట్టుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రద ర్శించిన నృత్యాలు, టైక్వాండో విన్యాసాలు ఆహూ తుల ను విశేషంగా అలరించాయి. ముఖ్యంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థులు ప్రదర్శించిన దశావతారాలు (కృష్ణం వందే జగద్గురుం) థీమ్ బేస్డ్ నృత్య ప్రదర్శన ఈ కార్యక్రమానికే హైలైట్‌గా నిలిచింది. దీనికి హాజరైన తల్లిద ండ్రులు, ఇతర ప్రము ఖుల నుంచి విశేష స్పందన, ప్రశంసలు లభించాయి. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతి థులుగా బయోకెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేసిన సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ పి.నరహరి ప్రసాద్ రెడ్డి, మీనాక్షి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ రవికాంత్ రమణ హాజరయ్యారు. వేదికపై యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలను కూడా ఎంతో సంతోషంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా చిన్నారి విద్యా ర్థులు తమ సర్టిఫికెట్లు, పతకా లను అందుకు న్నారు. స్కూల్ చైర్మన్ శ్రీ షాలీ దాదాగాంధీ స్వయంగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి, వారిని అభి నందించారు. విద్యార్థుల ప్రదర్శనలు చూసి తల్లిద ండ్రులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. పిల్లల్లో స్టేజ్ ఫియర్ (వేదికపై భయం) పోగొట్టి, వారిలో ఆత్మ విశ్వా సాన్ని పెంపొందించేలా ఇలాంటి ఎన్నో కార్యక్ర మాలను, యాక్టివిట ీలను నిర్వహి స్తున్నం దుకు పాఠశాల యాజ మాన్యా నికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వేదికపై చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రీమియం ఫారిన్ లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్ రెడ్డి

అనంతపురం వైద్యం మార్చి 26 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలో మద్యం ప్రీమియం ఫారిన్ లి క్కర్ స్టోర్ లైసెన్స్ ఏర్పాటు చేయడానికి గెజిట్ నోట ిఫికేషన్ విడుదల జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి రామమోహన్‌రెడ్డి అనంతపురం మున్సిపల్ కార్పొరే షన్ పరిధిలో ఏర్పాటు చేయబోయే ప్రీమియం స్టోర్‌కు స్థా పనకు ఆసక్తి గల అభ్యర్థులు రూ.15,00,000 నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజుతో ఏప్రిల్ 4వ తేదీ సాయ ంత్రం 6 గంటల లోపు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికా రి కార్యాలయం, అనంతపురం వద్ద దరఖాస్తులు సమర్పి ంచాలని తెలిపారు. లైసెన్స్ పొందిన వారు కాలం 01042026 నుండి 31122029 వరకు వ్యాపారల వా దేవీలు నిర్వహించవచ్చని పేర్కొన్నారు. వార్షిక రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూ.1,10,00,000 ఉండి ప్రతి సంవ త్సరం 10 పెరు గుదల ఉంటుందని, అర్హతలు, నిబం ధనలు గెజిట్‌లో పేర్కొన్న విధంగా అమలులో ఉంటాయని మరిన్ని వివరాలకు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి కార్యా లయం నందు సంప్రదించాలని సూచి ంచారు.

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు జన్మదిన వేడుకల్లో మంత్రి సవిత

పెనుకొండ మార్చి 26 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజర అచ్చెన్నాయుడు జన్మదినం వేడుకలు అమరావతిలోని సచివాలయంలో గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన జన్మదిన వేడుకల్లో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ , సహచర మంత్రులతో కలిసి అచ్చన్నాయుడుకి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపినట్టు పెనుకొండ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు.